ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జనగామ

శుక్రవారం 6 సెప్టెంబరు 2024

పేదల ఇంట్లో విద్యుత్ వెలుగులు





జఫర్‌గడ్, సెప్టెంబరు 5 : విద్యుత్ మీటర్లు లేని నిరుపేదలకు విద్యుత్ సంస్థ (ఎన్‌పీడీసీఎల్) సువర్ణ అవకాశం కల్పిస్తోంది. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలకు జీఎస్టీతో కలిపి రూ.937లకే గృహాలకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఈనెల 1వ తేదీ నుంచి విద్యుత్ సిబ్బంది గ్రామాల్లో తిరిగి ఇళ్లకు మీటరు లేని నిరుపేదలను గుర్తించి దరఖాస్తు చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. తద్వారా వారి నుంచి దరఖాస్తులు, మీటరు రుసుము తీసుకుని రసీదులు ఇవ్వడంతో పాటు రెండు రోజుల్లో వారి ఇంట్లో మీటరు బిగించేందుకు కార్యాచరణ చేపట్టారు. గతంలో ఇళ్ల విద్యుత్ కనెక్షన్ కోసం మీ-సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుని, కరెంటు లోడ్ ఆధారంగా రూ.వేలు చెల్లించాల్సి వచ్చేది. అయితే పేదలకు తాజాగా విద్యుత్ శాఖ అతి తక్కువ ధరకే మీటరు పొందడం సులభతరం చేసింది. 250 నుంచి 500 వాట్ల విద్యుత్ వినియోగించే పేద కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్ కోసం సిబ్బందికి డబ్బులు చెల్లిస్తే చాలు నేరుగా రశీదులు ఇచ్చే ఏర్పాట్లు చేసింది. విద్యుత్ మీటర్లు లేని వినియోగదారులు ఈనెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసు కోవాలని అధికారులు కోరుతున్నారు.




నిరుపేద కుటుంబాలకు అవకాశం...

దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న నిరుపేద కుటుంబాలకు విద్యుత్ సంస్థ ఈ పథకాన్ని వర్తింపజేస్తోంది. అయితే 250 నుంచి 500 వాట్ల విద్యుత్‌ను వినియోగించుకునే వారికి ఈ అవకాశం కల్పిస్తున్నారు. విద్యుత్ లోడ్ ఆధారంగా దరఖాస్తు ఫీజులు, చార్జీలు చెల్లించాల్సి ఉంటుంది. 500 వాట్స్ వరకు విద్యుత్ వినియోగించుకునేవారు దరఖాస్తు ఫీజు రూ.25లతో పాటు (అదనంగా 18 శాతం జీఎస్టీ (రూ.4.50లు)), డెవలప్‌మెంట్ చార్జీ రూ.600లతో పాటు (అదనంగా 18శాతం జీఎస్టీ (రూ108లు)), సెక్యురిటీ డిపాజిట్ రూ.200లు చొప్పున మొత్తం రూ.937-50లు చెల్లించాల్సి ఉంటుంది. 250 వాట్ల విద్యుత్ వాడకందారులు అప్లికేషన్ రుసుము రూ.25లతో పాటు (అదనంగా 18 శాతం జీఎస్టీ రూ.4.50లు), డెవలప్‌మెంట్ చార్జీ రూ.600లతో పాటు (అదనంగా 18శాతం జీఎస్టీ (రూ108లు)), సెక్యూరిటీ డిపాజిట్ రూ.80లు కలిపి మొత్తం రూ.817-50లు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

గృహజ్యోతి ఫలాలు అందించేందుకు..

పల్లెలు, గ్రామాలు, కాలనీలు, తండాల్లో చాలా మంది పేదలు విద్యుత్ మీటర్లు లేకుండానే కరెంటును వినియోగించుకుంటున్నారు. వీరు అధికారికంగా విద్యుత్ కనెక్షన్, మీటరుకు డబ్బులు చెల్లించే స్థోమత లేకపోవడంతో ప్రభుత్వం 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను ఉచితంగా అందించే గృహజ్యోతి పథకానికి దూరమయ్యారు. ఇలాంటి పేద కుటుంబాలకు తక్కువ ధరకే విద్యుత్ కనెక్షన్, మీటర్లు అందించేందుకు చర్యలు చేపట్టారు. అలాగే ఈనెల 17 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ప్రజా పాలన కార్యక్రమం నిర్వహించనుంది. ఈ నేపథ్యంలో విద్యుత్ మీటర్లు లేని పేద కుటుంబాల వారు గృహావసరాల కోసం దరఖాస్తు చేసుకుంటే అధికారులు ఈ నెల 15వరకు విద్యుత్ మీటర్లను అందజేయనున్నారు. తద్వారా వారు ప్రజా పాలనలో జీరో బిల్లు కోసం దరఖాస్తు చేసుకోవడం ద్వారా గృహజ్యోతి పథకం పొందే అవకాశం ఉంది. అదే నెల నుంచి వారికి సున్నా బిల్లు రానుంది.



15 వరకు దరఖాస్తుకు అవకాశం..

విద్యుత్ సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ మీటర్లు లేని గృహాలను గుర్తిస్తారు. గృహాలకు విద్యుత్ మీటర్లు లేని నిరుపేద కుటుంబాల వారు ఈ నెల 15వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలి. విద్యుత్ కేంద్రాలు, స్థానిక ఉప కేంద్రాల్లో గాని విద్యుత్ సిబ్బందికి దరఖాస్తు ఫారాలు అందించి విద్యుత్ వాట్స్ వినియోగం ప్రకారం డబ్బులు చెల్లిస్తే రశీదు ఇస్తారు. రెండు రోజుల్లోగా వినియోగదారుడి ఇంట్లో విద్యుత్ కనెక్షన్ ఇచ్చి మీటరు బిగించేలా ఏర్పాట్లు చేస్తారు. అయితే ఈ పథకం అమలులో దళారుల ప్రమేయం లేకుండా, చేతి వాటం చూపించకుండా చూడాల్సిన బాధ్యతతో పాటు అనర్హులకు మీటర్లు జారీ చేయకుండా నివారించాల్సిన అవసరం ఉంది.

- తక్కువ ధరకే విద్యుత్ మీటరు
- నిరుపేదలకు సువర్ణావకాశం
- గృహజ్యోతి ఫలాలు అందించేందుకు కసరత్తు
- బీపీఎల్ కుటుంబాలకు ఇచ్చేలా కార్యాచరణ
- దరఖాస్తు చేసుకున్న రెండు రోజుల్లోనే మీటరు ఏర్పాటు
- ఈ నెల 15 వరకు దరఖాస్తులకు అవకాశం

వినియోగించుకోవాలి : టి.వేణుమాధవ్, ఎన్‌పీడీసీఎల్, ఎస్ఈ, జనగామ



విద్యుత్ సంస్థ తక్కువ ధరకే గృహాలకు విద్యుత్ కనెక్షన్, మీటరు అందించే సౌకర్యాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలి. అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నాం. ఆయా గ్రామాల్లో విద్యుత్ సిబ్బంది విద్యుత్ మీటర్లు లేని కుటుంబాలను గుర్తించేందుకు సర్వే చేపడుతున్నారు.. 250 వాట్స్ వినియోగించే కుటుంబాల గృహాలకు జీఎస్టీతో కలిపి మొత్తం రూ..817-50లు, 500 వాట్స్ విద్యుత్ వినియోగించుకునే వారు జీఎస్టీతో కలిపి మొత్తం రూ.937-50లు చెల్లించాలి. దరఖాస్తుదారులు దళారులను ఆశ్రయించవద్దు. విద్యుత్ సిబ్బంది వద్ద రశీదు తీసుకోవాలి. రెండు రోజుల్లోగా మీటరును బిగించేలా ఏర్పాట్లు చేశాం. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న పేదలకు అతి తక్కువ ధరకు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ఎన్‌పీడీసీఎల్ సంస్థ ఈ సదవకాశాన్ని కల్పిస్తోంది. అలాగే మీటర్లు ఏర్పాటు తరువాత ఈనెల 17 నుంచి ప్రభుత్వం నిర్వహించే ప్రజాపాలనలో సున్నా బిల్లు కోసం వారు దరఖాస్తు చేసుకుంటే.. అదే నెల నుంచి గృహజ్యోతి (జీరో బిల్లు) పథకం సైతం వర్తిస్తుంది.

మేమెట్లా బతికేది?

దుకాణాలు తొలగిస్తే రోడ్డున పడతాం

ఆర్టీసీ అధికారులతో చిరువ్యాపారుల వాగ్వాదం



చిరు వ్యాపారుల దుకాణాలను తొలగింపజేస్తున్న ఆర్టీసీ అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 5: గత 20 ఏళ్లుగా ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా జాతీయ రహదారికి సంబంధించిన స్థలంలో చిరు దుకాణాలను పెట్టుకొని కుటుంబాలను పోషించుకుంటున్నాం.. ఇప్పుడు తీసేయమంటె ఎలా.. మీమెట్లా బతికేది అని చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులు కనికరం లేకుండా వారి సిబ్బందితో దుకాణాలను తొలగించడం భావ్యం కాదని బాధిత చిరు దుకాణాల నిర్వాహకులు వాపోయారు. గురువారం డివిజన్ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా జాతీయ రహదారి స్థలంలో పండ్లు, పూలు, జ్యూస్ సెంటర్లు, గాజుల దుకాణాలను ఆర్టీసీ అధికారులు తొలగించారు. దుకాణాలను తొలగించే క్రమంలో ఆర్టీసీ అధికారులకు చిరువ్యాపారులకు మధ్య కాసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. అయినప్పటికి ఆర్టీసీ విజిలెన్స్ అధికారులు ఏఎస్సై రవి, కానిస్టేబుల్ ఎస్ఆర్ రావు, హనుమకొండ బస్‌స్టేషన్ మేనేజర్ ఎపీపీ కుమార్, ఘన్‌పూర్ కంట్రోలర్ ఈసీ బాబు, శివానందం ఆధ్వర్యంలో సిబ్బంది సహకారంతో దుకాణాలను తొలగించారు. ఈ సందర్భంగా బాధిత దుకాణాల నిర్వాహకులు కుంభం కుమార్, షైల కలమ్మ, కుంభం సునీత, రాజమ్మ, పారిజాత, మణెమ్మ, పన్నీరు లతలు మాట్లాడుతూ 20 ఏళ్లుగా పది కుటుం బాలకు చెందిన వాళ్లం బస్టాండ్ ఎదురుగా దుకాణాలు పెట్టుకొని జీవనోపాధి పొందుతున్నామన్నారు. దుకాణాలను తొలగించడంతో జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారిందని తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేసి టెండర్‌లు నిర్వహించి బడా వ్యాపారులకు అప్పగించడంలో భాగంగా ఆర్టీసీ తమ కుటుంబాలను రోడ్డున పడేసే ప్రయత్నం చేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నామని తెలిపారు. సంబంధిత విషయమై ఘన్‌పూర్ ఆర్టీసీ కంట్రోలర్ ఈఎస్ బాబును వివరణ కోరగా ఆర్టీసీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేబడుతున్నమని, చిరు వ్యాపారులు వారి దుకాణాలను మరోచోటుకు మార్చుకోవాలని డీఎం మోహన్‌రావు నేరుగా కలిసి వారికి విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా దుకాణాలు పెట్టుకున్నప్పటికీ గౌరవప్రదంగా వారికి నోటీసులు సైతం ఇచ్చామని తెలిపారు. స్వచ్ఛందంగా వ్యాపారులే దుకాణాలు తొలగించుకుకోవాలని చెప్పడం జరిగిందన్నారు. అందులో భాగంగా తమ సిబ్బంది దగ్గర ఉండి వ్యాపారులతో దుకాణాలను తీయించామని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయానికి కేంద్రం ప్రోత్సాహం

- ఈ విధానంలో సాగు కోసం రూ.1500కోట్లు కేటాయింపు
- త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి
- కేసముద్రంలో సదస్సుకు హాజరు



వివరాలు 7లో..

అత్యాచార నిందితుడిని ఉరితీయాలి



ఆర్టీసీ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

జనగామ రూరల్, సెప్టెంబరు 5: మహిళపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడిని ఉరితీయాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కత్తుల లక్ష్మి అన్నారు. అసిఫాబాద్ జిల్లా జైనూర్‌లో మహిళపై లైంగికదాడి చేసిన నిందితుడిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ మహిళా మోర్చా, గిరిజన మోర్చా ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కత్తుల లక్ష్మి మాట్లాడుతూ మహిళలపై రోజురోజకు అత్యాచారాలు జరుగుతున్నప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. గిరిజన మహిళపై లైంగికదాడికి పాల్పడ్డ ఆటో డ్రైవర్ ముక్తమ్‌ను ప్రభుత్వం కఠినంగా శిక్షించి, మూడు రోజుల్లో ఉరి తీయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బానోత్ రామ్‌కోటి, హరిచంద్రగుప్త, శివరాజ్ యాదవ్, పవన్‌శర్మ, తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- జిల్లాలో ఘనంగా గురుపూజోత్సవం
- ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

జనగామ కల్చరల్, సెప్టెంబరు 5: సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు.జిల్లా కలెక్టరేట్‌లో గురువా రం నిర్వహించిన గురుపూజోత్సవ వేడుకలకు జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అధ్యక్షత వహించగా ఎమ్మెల్యే పల్లా ముఖ్య అతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన గావించి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ ఉపాధ్యాయ దినోత్సవం విద్యార్థులు స్ఫూర్తి పొందడానికి ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను పాటించాలని, వారి ఆలోచనలు ఆచరణాత్మకమని, తల్లిదండ్రులు మొదటి గురువులని, ఉపాధ్యాయులు స్ఫూర్తి ప్రదాతగా ప్రతి తరగతిలోని విద్యార్థి ఉపాధ్యాయులకు సవాల్ అన్నారు. అనేక విప్లవాలకు గురువు మూలపురుషుడని, ఈ విద్యా విప్లవంలో అంతరూ భాగస్వాములు కావాలని, ఆర్థిక పరిస్థితులు బాగా లేక ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతి విద్యార్థి ని బాగుచేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా మాట్లాడుతూ సెప్టెంబర్ 5న ఉపాధ్యాయుల దినోత్సవాన్ని డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను స్మరించుకుంటూ ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. నవంబరులో జరిగే న్యాస్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించే దిశగా విద్యార్థులను సన్నద్ధులను చేయాలని, వచ్చే పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు 10/10 జీపీఏ సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు.



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్ తదితరులు



విద్యార్థినుల సాంస్కృతిక నృత్యప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం..

అనంతరం జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 75 మంది సేవలను గుర్తించి ఇందులో భాగంగా 28 మంది స్కూల్ అసిస్టెంట్లు, 30 మంది ఎస్జీటీలతో పాటు కేజీబీవీ, జ్యోతిబాపూలే, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలకు చెందిన 18 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేయగా వారిని కండువాలు, జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలతో సన్మానించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఫ్యూచర్ ఓటర్స్ పై స్కిట్‌లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు రూ.10 వేలు, రూ.5 వేల చొప్పున క్యాష్ ప్రైజ్ అందజేశారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్ పర్సన్ పోకల జమున, 3వ వార్డు కౌన్సిలర్ పగిడిపాటి సుధ, డీఈవో కె.రాము, నరేందర్‌రెడ్డి, గంటా రవీందర్, స్వరూప, వసంత పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెట్రోల్ డబ్బాతో నిరసన



జనగామ తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న యశోద కుటుంబ సభ్యులు

జనగామ రూరల్, సెప్టెంబరు 5: భూవివాదం కారణంతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓ మహిళ పెట్రోల్ డబ్బాతో నిరసన వ్యక్తం చేసిన ఘటన జనగామలో గురువారం చోటు చేసుకుంది. తన భర్త శ్రీనివాస్‌కు వారస్వతంగా రావాల్సిన భూమిని భర్త సోదరులు అక్రమంగా పట్టా చేసుకోవడానికి ప్రయత్నించగా ఇద్దరు కూతుళ్లు, కుమారుడితో కలిసి జనగామ తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెట్రోల్ డబ్బాతో నిరసన చేపట్టింది. జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్‌కు చెందిన బాధిత మహిళ తేజావత్ యశోద మాట్లాడుతూ తన భర్తకు వారసత్వంగా రావాల్సిన భూమిని తన భర్త సోదరులు అక్రమంగా పట్టా చేసుకోవడానికి ప్రయతిస్తున్నారని ఆరోపించారు.

తన సమస్య పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్, ఆర్డీవో, ఎమ్మార్వో కార్యాలయంలో అనేకమార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం విచారణ చేసి తమకు రావాల్సిన వారసత్వ భూమిని తమకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే ఎమ్మార్వో కార్యాలయం ఎదుట ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు.

వేదికతోనే సమస్యల పరిష్కారం : వేణుగోపాలాచారి

పాలకుర్తి, సెప్టెంబరు 5: విద్యుత్ వినియోగదారుల సమస్యలు ఫిర్యాదులతోనే పరిష్కారించబడుతాయని వినియోగదారుల ఫిర్యాదు పరిష్కార వేదిక చైర్మన్ వేణుగోపాలచారి అన్నారు. మండల కేంద్రంలోని ఏడీఏ కార్యాలయం ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన పరిష్కార వేదిక లోకల్ కోర్టు నిర్వహించగా జనగామ ఎస్ఈ వేణుమాధవ్‌తో కలిసి ముఖ్య అతిథిగా వేణుగోపాలచారి హాజరై మాట్లాడారు. పాలకుర్తి, కొడకండ్ల మండలాల నుంచి వినియోగదారులు మొత్తం 25 ఫిర్యాదులు దరఖాస్తు రూపంలో చేశారని తెలిపారు. వీటిలో ట్రాన్స్‌ఫార్మర్ల షిఫ్టింగ్ కోసం నాలుగు దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. పేరు మార్పిడి చేసేందుకు ముగ్గురు ఫిర్యాదు చేశారని, గ్రామాల్లో లూజు లైన్లు సరిచేసేందుకు ఐదు ఫిర్యాదులు చేశారని తెలిపారు. బిల్లులో హెచ్చు, తగ్గుల కోసం ముగ్గురు పిర్యాదు చేశారని, ఏడు ఇతర ఫిర్యాదులు కూడా అందయాని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదులను క్షణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. వినియోగదారులు ఇచ్చిన ప్రతీ ఫిర్యాదును పరిష్కరిస్తామని తెలి పారు. సమావేశంలో రమేష్, చరణ్‌దాస్, ఎన్.నరేందర్, డీఈ గణేష్, జయరాజ్, ఏడీఈ బాలాగంగాధరతిలక్, ఏఈ రణధీర్, సత్తయ్య, సబ్ ఇంజనీర్ రామకృష్ణ, నిఖిల్‌రెడ్డి, రాకేష్ తదితరులు ఉన్నారు.



పాలకుర్తిలో వినియోగదారుల ఫిర్యాదుల వేదిక సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాలాచారి

ఘనంగా అబ్దుల్లా బాబా ఉర్సు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 5: అబ్దుల్లా బాబా ఉర్సు ఉత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. జనగామ పాత ఈద్గా వద్ద ఉన్న దర్గాలో హజరత్ అబ్దుల్లా బాబాకు ముత్తావళి ఇంటి నుంచి ముస్లింలు ఊరేగింపుగా వచ్చి చాదర్ కప్పి గంధం పూశారు. గులాబీ పూలు పెట్టి పూజలు నిర్వహించారు. అనంతరం ఈద్గా వద్ద అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మౌలానా, అలీ ఖాద్రి, ఎండి.ఎజాజ్, జమాల్ షరీఫ్, అబ్దుల్లా రహమాన్ షకీల్ తదితరులు పాల్గొన్నారు.



ఈద్గాలో పూజలు నిర్వహిస్తున్న ముస్లింలు

ఎరుపెక్కిన టేకులగూడెం

ముగిసిన మావోయిస్టు నేత మాచర్ల ఏసోబు అంత్యక్రియలు

అంతిమయాత్రకు హాజరైన ప్రజా, పౌర సంఘాల నాయకులు

వివరాలు 7లో

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ

బయ్యారం, సెప్టెంబరు 5 : వరద బాధితులకు గురువారం పోలీసులు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. విస్తారంగా కురుస్తున్న వర్షాలకు మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని వట్టివాగు ప్రవాహంతో మొట్లతిమ్మాపురం గ్రామానికి వారం రోజులుగా రాకపోకలు నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దీంతో ఎస్పీ ఎస్పీ సుధీర్‌రామ్ నాథ్ కేకన్ ఆదేశాలతో మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతి నేతృత్వంలో బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతితో పాటు పోలీస్ సిబ్బంది జేసీబీ వాహనం ద్వారా వాగుదాటి మొట్లతిమ్మాపురం గ్రామ ప్రజలకు నిత్యావసర సరుకులు, కురగాయలు పంపిణీ చేశారు. దాదాపు ఒక ట్రాక్టర్ నిండా సరుకులు తీసుకెళ్లి గ్రామ ప్రజలకు అందజేశారు. కొద్ది రోజులుగా తాము పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని పోలీసులు సరుకులు పంపిణీ చేయడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది అనిల్, సతీష్, రజిని, కోటేశ్వర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



బయ్యారంలో బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న పోలీసులు



వరంగల్ పోతననగర్‌లోని మోడ్రన్ దోబీఘాట్



వాషింగ్ మిషన్లు, ఐరన్ బాక్స్ టేబుళ్లు

మోడ్రన్ దోబీఘాట్‌పై పట్టింపేదీ?

- నిరుపయోగంగా పోతననగర్ దోబీఘాట్
- కోట్లు ఖర్చు చేసినా ఫలితం శూన్యం
- నిరుపయోగంగా విలువైన సామగ్రి
- ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయ లోపం
- నిర్వహణ బాధ్యతపై ఎటూ తేల్చని అధికారులు
- రజక సంఘాలకు అప్పగించాలని డిమాండ్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 5: అట్టహాసంగా ప్రారంభించిన వరంగల్ మోడ్రన్ దోబీఘాట్(ల్యాండ్రో మార్ట్) పది నెలలకే పనులకు నోచుకోకుండా పోయింది. పనులు మొత్తం పూర్తయినా బల్దియా, బీసీ వెల్ఫేర్ శాఖల మధ్య నెలకొన్న సమన్వయ లోపంతో ఎక్కడి పనులక్కడే అన్నట్టు విమర్శలు వస్తున్నాయి.

అధునాతన రీతిలో..

వరంగల్ పోతననగర్‌లో ఏర్పాటు చేసిన మోడ్రన్ దోబీఘాట్ అధునాతన సాంకేతికతతో రూపుదిద్దుకుంది. స్మార్ట్‌సిటీ నిధుల కింద ముందుగా రూ.1.10 కోట్లు మంజూరు చేయగా, తర్వాత మరో రూ.కోటితో షెడ్డుతో పాటు అక్కడ అన్ని సౌకర్యాలు, ప్రత్యేక పవర్ ట్రాన్స్‌ఫార్మ్‌ను ఏర్పాటు చేశారు. పోతననగర్‌లో ఏర్పాటు చేసిన మోడ్రన్ దోబీఘాట్‌కు ఇప్పటి వరకు రూ.2.50 కోట్ల వరకు ఖర్చు చేసినట్టు బల్దియా అధికారులు వెల్లడించారు. అందులో 30కిలోల వాషింగ్ మిషన్లు 9, 15కిలోల స్పిన్ మిషన్లు 9, 30కిలోల డ్రై మిషన్లు 12, 10 టేబుళ్లపై ఆర్వో స్ట్రీం వాటర్ టెక్నాలజీతో నడిచే 10 ఐరన్ బాక్సులతో పాటు పెద్ద పెద్ద టబ్బులు, కెమికల్ స్టోరేజ్ మిషన్లను ఏర్పాటు చేశారు. ఇంకా మోడ్రన్ దోబీ మిషన్లు, శారీ రోలింగ్ మిషన్లు, బెట్‌షీట్ ఏరస్ మిషన్లు ఏర్పాటు చేశారు. ఈ మిషన్ల ద్వారా డ్రైక్లీనింగ్, డ్రైవాష్, స్ట్రీం ఐరన్ వాష్, నార్మల్ వాష్, స్పిన్ వాష్, కెమికల్ వాష్, నాచురల్ వాష్‌ల పద్ధతిలో అన్ని రకాల బట్టలు శుభ్రం చేయవచ్చని తెలిపారు.

ఏకతాటిపైకి కుల సంఘం నాయకులు

వరంగల్ నగరంలో రజకుల అభివృద్ధి కోసం మోడ్రన్ దోబీఘాట్ ఏర్పాటు చేస్తున్నారని, ఇందులో రజకులైన ప్రతీ ఒక్కరు సభ్యులుగా ఉండవచ్చని ప్రజా ప్రతినిధులు, సంఘం నాయకులు తెలిపారు. ముందుగా ప్రాంతాల వారీగా ఉన్న రజక సంఘాల నాయకులను ఏక తాటిపైకి తెచ్చి తర్వాత వరంగల్ ట్రైసిటీస్ సమావేశం ఏర్పాటు చేశారు. సుమారు 500 నుంచి 600 మంది వరకు సభ్యులుగా చేర్చుకుని మడేలయ్య మోడ్రన్ దోబీఘాట్ సొసైటీగా ఏర్పడ్డారు. ప్రత్యేక వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకుని ఎప్పటికప్పుడు సమాచారాన్ని ఒకరికొకరు చేరవేసుకుంటున్నారు. బస్వరాజు సారయ్యను సంఘానికి ముఖ్య సలహాదారుడిగా చేసుకుని, ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా ఉన్న సంఘాల నుంచి ఇద్దరు, ముగ్గురి చొప్పున తీసుకుని పెద్ద సంఘంగా ఏర్పడ్డారు. అయితే వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో నివసించే రజక కార్మికులు.. చేసిన పనికి తీసుకునే ధరలు విషయంలో కొంత వ్యత్యాసం ఉండడంతో కొందరు వెనక్కి తగ్గినట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో అధికారులు సైతం ముందుకు రావడం లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదంతా పక్కన పెడితే తక్కువ సమయంలో ఎక్కువ బట్టలు ఉతకడం, ఇస్త్రీ చేయడం, డ్రైక్లీనింగ్‌తో రజకులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ల్యాండ్రోమార్ట్ పనులను ప్రారంభిస్తున్న కేటీఆర్, అధికారులు (ఫైల్)

అట్టహాసంగా..

2021లో వరంగల్ నగరంలో మోడ్రన్ దోబీఘాట్‌నే ఏర్పాటు చేసేందుకు సంఘం ప్రతినిధులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. 2022లో పనులు ప్రారంభమయ్యాయి. స్మార్ట్‌సిటీ ప్రత్యేక నిధులతో వరంగల్ పోతననగర్‌లో ల్యాండ్రో మార్ట్ (దోబీఘాట్) పనులు పూర్తి చేశారు. కాగా, పోతననగర్‌లోని దోబీఘాట్‌తో పాటు అలంకార్ జంక్షన్‌లో అభివృద్ధి పనులు, పాత సెంట్రల్ జైలు ముందు లైబ్రరీ, చెత్త ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లను 2023 అక్టోబరు 6న అప్పటి ఐటీ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. దోబీ కుల సంఘాల నాయకులు, కార్మికులను పిలిచి ఎక్స్‌పర్ట్స్ ట్రయల్ రన్ కూడా చేశారు. కానీ దోబీల ఆనందం ఎంతో సేపు ఉండలేకపోయింది. అదే రోజు వేసిన తాళం ఇప్పటికీ తెరుచుకోలేదు. బల్దియా, బీసీ వెల్ఫేర్ శాఖల మధ్య సమన్వయం లేకపోవడం కుల సంఘం నాయకులు నిర్లక్ష్యం చేయడం వల్లనే ఇప్పటి వరకు అందుబాటులోకి రాలేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో రజకులకు ప్రత్యేక రుణాలు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులుగా గుర్తించి దోబీఘాట్ పనులు అప్పగించాలని సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. ఇంకా ప్రభుత్వ వసతి గృహాలు, ఆస్పత్రులు, స్కూళ్లు, రెస్టారెంట్ల బట్టలు కూడా కాంట్రాక్ట్ పద్ధతిలో ఇక్కడే ఉతికేందుకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. రజకుల్లో చాలామంది పెద్ద పెద్ద చదువులు చదివిన వారు నిరుద్యోగులుగా ఉన్నారని ఇక్కడ సుమారు 200 మందికి రెండు షిఫ్టులలో పనికల్పించి ఉపాధి అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే సులువుగా విలువైన బట్టలు ఉతికే దోబీ ఘాట్ సామగ్రి శిథిలావస్థకు చేరుకుంటుందని రజక సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు లక్షల రూపాయలు సంపాదించి పెట్టే పరికరాలు తుప్పుపట్టి పనికి రాకుండా పోయే పరిస్థితి ఉందని, బల్దియా అధికారులు బీసీ వెల్ఫేర్ అధికారులను పిలిచి త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని రజక సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

భార్య కాపురానికి రావడం లేదని యువకుడి ఆత్మహత్య

తొర్రూరు, సెప్టెంబరు 5 : భార్య కాపురానికి రావడం లేదని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం తొర్రూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం... దంతాలపల్లి మండలం గున్నెపల్లికి చెందిన ఎస్.కె. షరీఫ్(28) తొర్రూరులో వెల్డింగ్ షాపులో కూలీ పనిచేస్తూ నివసిస్తున్నాడు. అతడికి ఇద్దరు కమార్తెలు. మద్యానికి బానిసై తిరుగుతుండడంతో పది రోజుల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోగా మనస్థాపానికి గురై ఉరివేసుకొని చనిపోయాడు. తండ్రి జానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి ట్రాక్టర్ డ్రైవర్..

డోర్నకల్, సెప్టెంబరు 5 : పురుగుల మందు తాగిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన డోర్నకల్ మండలం తోడేళ్లగూడెం గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం. తోడేళ్లగూడెంకు చెందిన దండుగుల వెంకన్న (45) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొంత కాలంగా వెంకన్న మద్యానికి బానిసయ్యాడు. దీంతో అయన భార్య ఎల్లమ్మ ఈనెల 4న అతన్ని మందలించడంతో ఇరువురి మధ్య వాగ్వావాదం చోటు చేసుకుంది. దీంతో మనస్తాపానికి గుర్రైన వెంకన్న పురుగుల మందు తాగాడు. ఇది గమనించిన కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వెంకన్న మృతి చెందాడు. మృతుడికి భార్య ఎల్లమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని తండ్రి నాగయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మానుకోట పట్టణంలో భారీ చోరీ

- 12 తులాల బంగారం, 80 తులాల వెండి ఆభరణాలు, రూ.2లక్షల నగదు అపహరించిన దుండగులు

మహబూబాబాద్ రూరల్, సెప్టెంబరు 5: జిల్లాకేంద్రంలో బుధవారం భారీ చోరీ జరిగి 12 తులాల బంగారం, 80 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.2 లక్షల నగదు గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోయిన సంఘటన చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ పట్టణం శివారు కంకరమిల్లు సమీపంలో కాలనీకి చెందిన కాసోజు బ్రహ్మచారి పురోహితుడిగా చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు చెప్పారు. తన భార్య అశ్వినికి ఆరోగ్యం బాగోలేకపోవడంతో చికిత్స నిమిత్తం గత శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లానని, వర్షాలు రావడంతో మహబూబాబాద్‌కు రాకపోకలు బంద్ కావడంతో హైదరాబాద్‌లోనే ఉన్నట్లు చెప్పారు. బుధవారం సాయంత్రం తనభార్య అశ్విని తీసుకుని ఇంటికి వచ్చానని ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండడంతో ఇంట్లోకి వెళ్లి చూసినట్లు చెప్పారు. బీరువాలో ఉన్న 12 తులాల బంగారం, 80 తులాల వెండి అభరణాలతో పాటు రూ.2. లక్షల నగదు కన్పించకపోవడంతో ఈ విషయాన్ని వెంటనే టౌన్ పోలీసులకు సమాచారం అందించినట్లు చెప్పారు. ఘటన స్థలానికి క్లూజ్‌టీం సభ్యులు చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఆపై వేలిముద్రలను సేకరించారు. ఈ విషయంపై బాధితుడు బ్రహ్మచారి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

జీవంజి దీప్తి తొలి గురువు కన్నుమూత

▸▸ ఆమెలోని క్రీడాకారిణిని గుర్తించిన వెంకటేశ్వర్లు



వెంకటేశ్వర్లు (ఫైల్)

పర్వతగిరి, సెప్టెంబరు 5: పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన జీవంజి దీప్తి తొలి గురువు అయిన బియ్యాని వెంకటేశ్వర్లు(55) అనారోగ్యంతో బుధవారం రాత్రి కన్నుమూశారు. రూరల్ డెవలప్‌మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పర్వతగిరి మండలం కల్లెడలో నిర్వహిస్తున్న పాఠశాలలో 2000 సంవత్సరం నుంచి 2018 వరకు వ్యాయామ ఉపాధ్యాయుడిగా సేవలందించారు. ఆ సమయంలో పాఠశాల విద్యనభ్యసిస్తున్న దీప్తిలో దాగి ఉన్న క్రీడాకారిణిని గుర్తించిన వెంకటేశ్వర్లు ప్రత్యేక శిక్షణనిచ్చారు. పాఠశాల, కళాశాలస్థాయిల్లో ఆయన ఇచ్చిన శిక్షణతోనే దీప్తి పలు జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి పతకాలు సాధించింది. అనంతరం సాయ్ అకాడమీలో శిక్షణ పొందింది. కాగా, పీఈటీ వెంకటేశ్వర్లు నాలుగేళ్లుగా పక్షవాతంతో బాధపడుతూ తన స్వగ్రామమైన బయ్యారం మండలంలోని ఇర్సులాపురంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆరోగ్యం విషమించి బుధవారం రాత్రి మృతిచెందారు.

కదిలిస్తున్న దీప్తి మాటలు



వెంకటేశ్వర్లుతో దీప్తి (ఫైల్)

ఇటీవల ఒక టీవీ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో దీప్తి తన మొదటి కోచ్ అయిన వెంకటేశ్వర్లు గురించి ఆసక్తికరమైన విషయాలు వెల్లడించారు. 'వెంకటేశ్వర్లు సార్‌ది నిరుపేద కుటుంబం. నాలోని ప్రతిభను గుర్తించి ఆయన ఇచ్చిన ప్రత్యేక శిక్షణ నేను పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించగలిగా. ఒలింపిక్స్‌లో పాల్గొని మెడల్ సాధించిన తరువాత అది కళ్లారా చూసి చనిపోతానని సార్ అనేవారు' అంటూ దీప్తి ఆ ఇంటర్వ్యూలో తెలిపింది. కానీ యాదృచ్ఛికంగా నిజంగా ఆయన గతంలో దీప్తితో అన్నమాటలే నిజయమ్యాయి. దీప్తి పారాలింపిక్స్‌లో కాంస్యం గెలుచుకున్న మరుసటి రోజునే ఆయన కన్నుమూశారు. ఈ నేపథ్యంలో దీప్తి ఓ చానల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన మాటలు ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ఈ వీడియో చూసి పలువురు కన్నీటి పర్యంతమవుతున్నారు.

వరహాల గుట్టకు మహర్దశ

▸▸ ములుగు జిల్లాలో మరో పర్యాటక కేంద్రంగా అభివృద్ధి

▸▸ కాకతీయుల కాలం నాటి కట్టడాల గుర్తింపు

▸▸ త్వరలో గుట్టపై 40 గుడారాలు.. క్రాఫ్ట్ ఫైర్ ఏర్పాటు

▸▸ రామప్ప సరస్సుకు కూతవేటు దూరంలో కొత్త శోభ



కాకతీయుల కాలంలో ఏర్పాటు చేసిన రాళ్లగోడ

వెంకటాపూర్(రామప్ప), సెప్టెంబరు 5: కాకతీయుల కాలంనాటి రహస్య గుట్ట.. అక్కడ వజ్ర వైడూర్యాలు ఉన్నాయా? లేదంటే కాకతీయుల కాలంనాటి రహస్య స్థావరం ఉందా? రాజులుదాచిన ఖజానా ఏమైనా ఉందా? అనే ప్రశ్నలతో పాటు మేడారం సమ్మక్క-సారలమ్మలతో యుద్ధం జరిగిన సమయంలో కాకతీయ రాజులు ఇక్కడే సేద తీరినట్లు చెబుతుంటారు. ఇలా ఎన్నో అంతుచిక్కని ప్రశ్నలు దశాబ్దాలుగా ఆ గుట్టచుట్టు తిరుగుతూనే ఉన్నాయి. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప సరస్సుకు కూతవేటు దూరంలో కనిపించే ఆ కొండపైకి ఎక్కడానికి ఈ తరం వారెవరూ అంతగా ఆసక్తి చూపరు. కానీ పైకి ఎక్కిచూస్తే చుట్టుపక్కల గ్రామాలన్నీ కనిపిస్తాయని చరిత్రకారులు చెబుతున్నారు. కాకతీయుల కాలంలో ఎడ్లబండ్లపై గుట్టపైకి వెళ్లినట్టు ఇటీవల గుర్తించిన పలు ఆనవాళ్ల ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం ఆ గుట్టపైకి ఎక్కాలంటే నడవాల్సిందే. కాకతీయుల కాలంలో రామప్ప సరస్సు ఆయకట్టు కింద కాకతీయ రాజులు తాము పండించిన ధాన్యం బందిపోట్లు లాక్కెళుతున్నారని, ధాన్యం రక్షణ కోసం గుట్టపై రహస్య స్థావరం ఏర్పరిచినట్లు కథనం ప్రకచారంలో ఉంది. దీనికి తగ్గట్లే ధాన్యం ఆరబోసేందుకు ఓ కల్లం ఏర్పాటు చేసిన ఆనవాళ్లు కూడా ఉన్నాయి.

గుట్టపై భారీ రాళ్ల గోడ

సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న వరహాల గుట్ట పైభాగంలో రాళ్లతో భారీ ప్రహరీ నిర్మించారు. తాగునీటి బావి, పచ్చళ్లు నూరడానికి రోళ్లు, బండి చక్రాలు నడిచిన ఆనవాళ్లున్నట్లు చరిత్రకారులు చెబుతున్నారు. శిథిలమైన ఓ వినాయకుడి విగ్రహం కూడా గుట్టపై లభ్యమైనట్లు తెలుస్తోంది. హిందూ సంప్రదాయం ప్రకారం మొదటి పూజ వినాయకుడికి చేస్తాం కాబట్టి కాకతీయులు కూడా ఇదే సంప్రదాయాన్ని పాటిస్తూ గుట్ట ప్రారంభ దారిలోనే వినాయకుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్టు భావిస్తున్నారు. అంతే కాకుండా అంత ఎత్తులో ఉన్న గుట్టపై బావి నిర్మించి నీటిని తోడుకున్నారంటే చాలా కాలం ఇక్కడ నివసించి ఉన్నారని అర్థం చేసుకోవచ్చని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇది నిర్మించింది కూడా రేచర్లే!

కాకతీయ సేనాని రేచర్ల రుద్రయ్య రామప్ప దేవాయాన్ని నిర్మించినట్టు చరిత్ర ద్వారా తెలుస్తుండగా అదేవిధంగా వరహాల గుట్టపై కాకతీయుల ఉన్నట్లు వారి అవసరాల కోసం అక్కడ అన్నీ నిర్మాణాలు చేసినట్టు భావిస్తున్నారు. కొందరు సైనిక స్థావరం కోసమని, మరికొందరు విలువైన సంపద, ఖజానా దాచుకోవడం కోసమని, ఇంకొందరు సమ్మక్క-సారక్కలతో యుద్ధం జరిగిన సమయంలో రాజులు సేద తీరడాకని, విలువైన ఆభరణాలు, ధాన్యం దాచుకోవడానికని గుట్టపై ఏర్పాట్లు చేసుకున్నారని చెబుతున్నారు. అందువల్లే ఈగుట్టకు వరహాలగుట్ట అనే పేరు వచ్చిందని భావిస్తున్నారు. కాకతీయులు నిర్మించిన ఈగుట్ట పైభాగంలో ఉన్న పురాతన సంపదనను కాపాడటంతో పాటు పర్యాటకులకు ఈ అందాలు, కాకతీయుల కాలం నాటి గుర్తులను చేరువ చేసేలా అభివృద్ధి చేయనున్నట్టు సమాచారం. మరో నెలరోజుల్లో ఈ గుట్టుకు మహర్దశ వచ్చేలా చర్యలు తీసుకోబోతున్నట్టు తెలుస్తోంది.

గుట్టపై ప్రదేశంలో పర్యాటకుల కోసం గుడారాలు

అటవీశాఖ ఆధ్వర్యంలో రామప్ప సరస్సు సమీపంలో ఉన్న వరహాలగుట్టపై ఉన్న ఐదెకరాల ప్రదేశాన్ని పర్యాటక కేంద్రంగా తయారు చేసేందుకు ములుగు అటవీశాఖ అధికారి (డీఎఫ్‌వో) ఆదేశాలతో ములుగు ఫారెస్ట్ రెంజర్ డోలి శంకర్ ఆధ్వర్యంలో పర్యాటకులను ఆకర్షించే విధంగా పనులు మొదలయ్యాయి. ఈ నెలాఖరు కల్లా గుట్టపైకి పర్యాటకులను అనుమతించే అవకాశం కనిపిస్తోంది. అయితే కాలినడకన వెళ్లేందుకు మూడు మీటర్ల వెడల్పుతో గుట్టకు ఉన్న బండరాళ్ల తోనే దారి ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం రహదారి పనులు పూర్తి కావస్తుం డగా.. పనులు వేగంగా జరుగుతున్నాయి. గుట్టపై 50 గుడారాలు ఏర్పాటు చేసి వాటి ముందు భాగంలో పర్యాటకులను ఆకర్షించే విధంగా క్రాఫ్ట్ ఫైర్ (కట్టెలతో మంటలు) ఏర్పాటు చేయనున్నారు. రామప్ప సరస్సు సమీపంలోని వరహాల గుట్ట పర్యాటకంగా విరాజిల్లానుండటంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



వరహాల గుట్టపైకి వేస్తున్న కాలిబాట

సరస్సు నుంచి గుట్టపైకి రోప్‌వే ఏర్పాటు చేయాలి

పూల్యాల రామన్న, టూరిజం మార్కెటింగ్ ప్రచారకర్త



కాకతీయుల చరిత్రతో పాటు మనకు అంతు చిక్కని బోలెడు విషయాలు వరహాల గుట్ట పైభాగంలోనే కాలగర్భంలో కలిసిపోతున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలోనూ ఈ వరహాల గుట్ట గురించి కొందరికి మాత్రమే తెలుసు. ప్రభుత్వం, పురావస్తు, పర్యాటక శాఖల అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుంటే అంతరించిపోతున్న కాకతీయుల చరిత్రను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు అందించే అవకాశం ఉంది. దీంతో పాటు గుట్టపైకి పర్యాటకులు వెళ్లేందుకు రామప్ప సరస్సు నుంచి గుట్టపైకి రోప్‌వే ఏర్పాటు చేస్తే పర్యాటక శాఖకు, ప్రభుత్వానికి నిజంగానే 'వరాలు' కురుస్తాయి.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల స్వీకరణ



ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకుంటున్న ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డి, కొంక అనురాధ, జి.వెంకటయ్య



డాక్టర్ ఎల్.కొమురారెడ్డి

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 5: వరంగల్, హనుమకొండ జిల్లాల నుంచి రాష్ట్ర స్థాయి పలువురు ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులు స్వీకరించారు. హైదరాబాద్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో కొంక అనురాధ, పి.సంపత్‌కుమార్, జి.వెంకటయ్య, డాక్టర్ ఎల్. కొమురారెడ్డి తదితరులు గురువారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులను స్వీకరించారు.

రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు అందుకున్న వెంకట్రామిరెడ్డి, వాసం శ్రీనివాస్



పి.సంపత్‌కుమార్

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ భైరు వెంకట్రామిరెడ్డి గురువారం హైదరాబాద్ రవీంద్రభారతిలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, మాజీ ఎంపీ కే.కేశవరావు, రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం చేతుల మీదుగా రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖా ధికారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ వాసం శ్రీనివాస్

హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకుడు డాక్టర్ వాసం శ్రీనివాస్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డును గురువారం అందుకున్నారు. హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరిగిన గురుపూజోత్సవ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లుభట్టి విక్రమార్క, రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మాత్యు లు పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన ఇతర ప్రముఖుల చేతుల మీదుగా అందుకున్నారు.

ప్రకృతి వ్యవసాయానికి కేంద్రం ప్రోత్సాహం



తాళ్లపూసపల్లిలో పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి, వ్యవసాయ డ్రోన్‌ను ఆపరేట్ చేస్తూ పరిశీలిస్తున్న గవర్నర్

▸▸ ఈ విధానంలో సాగు కోసం రూ.1500 కోట్లు కేటాయింపు

▸▸ త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి

▸▸ కేసముద్రంలో సదస్సుకు హాజరు

కేసముద్రం, సెప్టెంబరు 5 : పర్యావరణాన్ని కాపాడుకుంటూ చేసే ప్రకృతి వ్యవసాయాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ఈ విధానంలో సాగు కోసం రూ.1500 కోట్లు కేటాయించిందని, సహజసిద్ధ విధానంలో పండిన ఉత్పత్తులను ఆహారంగా తీసుకున్న వారు ఆరోగ్యంగా ఉంటారని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం తాళ్లపూసపల్లిలో గురువారం 'ప్రకృతి వ్యవసాయం'పై నిర్వహించిన సదస్సుకు ఆయన హాజరయ్యారు. తొలుత గవర్నర్‌ను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పోలీసుల గౌరవ వందనం స్వీకరించిన ఇంద్రసేనారెడ్డి తాళ్లపూసపల్లి, కల్వల గ్రామాల్లో స్వయం సహాయక సంఘాలకు 'నమోడ్రోన్ దీదీ' పథకంలో భాగంగా మంజూరైన వ్యవసాయ డ్రోన్‌ల పనితీరును పరిశీలించారు. ఆ తర్వాత అభినవ్‌రెడ్డి ఫౌండేషన్ బాధ్యుడు సొల్లేటి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ శిక్షణ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ గత వారంలో జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో రైతు సంక్షేమం కోసం కీలక నిర్ణయాలు తీసుకున్నారని, భూసారం వివరాలతో కూడిన 'భూమి ఆరోగ్య కార్డు'ను రూపొందించేందుకు నిర్ణయించిందని వివరించారు. ఇటీవల గుజరాత్‌లో నిర్వహించిన గవర్నర్ల సమావేశంలో ప్రధాని మోదీ చొరవతో ప్రకృతి సాగు విధానంలోని పంట ఉత్పత్తులతో వండిన భోజనాన్ని వడ్డించారని చెప్పారు. తాను పని చేస్తున్న త్రిపుర రాష్ట్రంలో కూరగాయల మొక్కల ఆకులను సైతం వంటల్లో వినియోగిస్తూ విక్రయిస్తున్నారని తెలిపారు. వ్యవసాయంలో పశువులను వినియోగించే కుటుంబాలు సంతోషంగా ఉంటాయని అన్నారు.

భూ తాపంతోనే వరదలు

ప్రకృతి వ్యవసాయ నిపుణుడు విజయ్‌రామ్

పెరిగిన రసాయన మందుల వినియోగం, వాతావరణ కాలుష్యం, భూ తాపంతోనే వరదలు, ప్రకృతి విపత్తులు వస్తున్నాయని, ఇది ఆరంభమేనని.. భవిష్యత్తులో ఇంకా ఇలాంటివి వస్తాయని ప్రకృతి వ్యవసాయ నిపుణుడు విజయ్‌రామ్ హెచ్చరించారు. ఈ సదస్సుకు శిక్షకుడిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సూక్ష్మపోషకాలు లేని ఆహారాన్ని తీసుకుంటున్నారని తద్వారా కాన్సర్, తదితర వ్యాధులు వస్తున్నాయని అన్నారు. ఏ జీవిని చంపకుండా అహింసా మార్గంలోనే ప్రకృతి వ్యవసాయ విధానం ఉంటుందని తెలిపారు. ప్రకృతి సాగు విధానంలో ఒక ఎకరంలో రూ.3 లక్షల ఆదాయాన్ని చూపుతానని వివరించారు. తాను పండించిన ఆహార ఉత్పత్తులతోనే తిరుపతిలో ప్రసాదం తయారు చేస్తున్నారని తెలిపారు.

ప్రకృతి ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలి

నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

ప్రకృతి విధానంలో పండించిన పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని సదస్సుకు హాజరైన నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కోరారు. 'నమో డ్రోన్ దీదీ' పథకంలో భాగంగా మహబూబాబాద్ జిల్లాకు మూడు వ్యవసాయ డ్రోన్‌లు ఇచ్చారని, తమ నర్సంపేట నియోజకవర్గంలోని మహిళా సంఘాలకు కూడా డ్రోన్‌లు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్‌డీవో అలివేలు, రాంమోహన్‌రెడ్డి, డీఏవో విజయనిర్మల, ట్రాన్స్‌కో డీఈ విజయ్‌కుమార్, తహసీల్దార్ టి.దామోదర్, ఏవో బి.వెంకన్న పాల్గొన్నారు.

వాయిదా పడిన ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ పరీక్షలు 9న

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 5: కాకతీయ యూనివర్సిటీ ఐదేళ్ల ఇండిగ్రేటెడ్ బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ పరీక్షలను సెప్టెంబరు 9న నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పీఎస్ఎల్ సౌజన్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 2న జరగాల్సిన పరీక్షలు భారీవర్షాల కారణంగా వాయిదా పడిన విషయం విదితమే. ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, రెండో, నాలుగో సెమిస్టర్ పరీక్షలు గతంలో ప్రకటించిన షెడ్యూల్ మేరకు జరుగుతాయని వెల్లడించారు. పరీక్షల సమయంలో, పరీక్షల కేంద్రాల్లో ఎలాంటి మార్పులు లేవని స్పష్టం చేశారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, సెప్టెంబరు 5: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోమ టిపల్లిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట శిబిరంపై దాడి చేసారు. గురువారం పేకాట శిబిరంపై దాడి చేసిన పోలీసులు రూ.31వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, మూడు బైక్స్ స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకుని నలుగురిని విచారణ నిమిత్తం కేయూ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.రాజు ధృవీకరించారు.

జూడో క్రీడాకారులకు చేయూత



క్రీడాకారులకు రవాణా చార్జీల టికెట్లను అందజేస్తున్న శ్రీనివాస్

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 5: జూడో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సెప్టెంబరు 9నుంచి 12 వరకు చెన్నైలో నిర్వహించనున్న 4వ ఖేలో ఇండియా ఉమెన్స్ సబ్ జూనియర్స్, సీనియర్స్ సౌత్‌జోన్ టోర్నమెంట్‌లో పాల్గొననున్న జిల్లా జూడో క్రీడాకారులకు సీనియర్ క్రీడాకారుడు ఎల్.శ్రీనివాస్ రవాణాఖర్చులను అందించారు. వరంగల్ ఓ సిటీ క్రీడా మైదానంలో ఖేలో ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జూడో శిక్షణ కేంద్రాన్ని గురువారం శ్రీనివాస్ సందర్శించి క్రీడాకారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలపై ఉన్న ఆసక్తితో ఒక సీనియర్ క్రీడాకారుడిగా ప్రతిభ కలిగిన పేద క్రీడాకారులకు చేయూతనందించేందుకు సహాయ సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయన్నారు. ఖేలో ఇండియా ఆధ్వర్యంలో ఓసిటీ క్రీడా మైదానంలో శిక్షణ పొందుతున్న 10మంది క్రీడాకారిణులకు చెన్నైలో నిర్వహించనున్న సౌత్‌జోన్ పోటీలకు హాజరుకానున్న నేపథ్యంలో వారు క్రీడా పోటీలకు వెళ్లి రావడానికి రైల్వే రవాణా ఖర్చులను అందించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డీవైఎస్‌వో సత్యవాణి, ఖేలో ఇండియా జూడో కోచ్ జె.లింగమూర్తి డీఎస్ఏ కోచ్‌లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకుడిపై కేసు నమోదు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 5: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని శాంతినగర్‌లో మట్కా నిర్వహిస్తున్న బండి రాజు నివాసంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని అతడి వద్ద నుంచి రూ.32 వేలు స్వాధీనం చేసుకున్నారు. చిరువ్యాపారులను మోసం చేసి బెట్టింగ్ నిర్వహిస్తున్న బండి రాజును విచారణ నిమిత్తం మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు. మిల్స్‌కాలనీ పోలీసులు రాజుపై కేసు నమోదు చేసారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీధర్ ధృవీకరించారు.

వైన్‌షాపులో చోరీ

ధర్మసాగర్, సెప్టెంబరు 5: ధర్మసాగర్ మండల కేంద్రంలోని వైన్స్ షాపులో గుర్తు తెలియని వ్యక్తులు గురువారం చోరీకి పాల్పడ్డారు. సిబ్బంది కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని శివ బాలాజీ వైన్స్‌షాపులో గురువారం తెల్లవారుజామున షాపునకు సంబంధించిన కిటికీలకు అమర్చిన గ్రిల్స్‌ను గడ్డపారల సహాయంతో దొంగలు తొలగించారు. ఆ తర్వాత షాపులోకి ప్రవేశించి కౌంటర్‌లో ఉన్న రూ.85,500తో పాటు రూ.2వేల విలువైన మద్యాన్ని అపహరించారు. షాపు యాజమాని శ్యాంసుందర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విషజ్వరంతో యువకుడి మృతి



విజయ్ (ఫైల్)

కొత్తగూడ, సెప్టెంబరు 5: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని గాంధీనగర్‌కు చెందిన ఓ యువకుడు విషజ్వరంతో గురువారం మృతి చెందాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్ గ్రామానికి చెందిన మల్లెల విజయ్ (30) మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. గురువారం ఆయనకు జ్వరం తీవ్రత ఎక్కువ కావడంతో వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్సపొందుతూ విజయ్ మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య స్వర్ణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా, విజయ్ వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.

ఎరుపెక్కిన టేకులగూడెం

▸▸ ముగిసిన మావోయిస్టు నేత మాచర్ల ఏసోబు అంత్యక్రియలు

▸▸ అంతిమయాత్రకు హాజరైన ప్రముఖులు

▸▸ ఇది బూటకపు ఎన్‌కౌంటర్ : భారతక్క

కాజీపేట, సెప్టెంబరు 5: ఎర్ర జెండాలతో టేకులగూడెం ఎరుపెక్కింది. ఎర్రజెండాల సాక్షిగా ఎన్‌కౌంటర్‌లన్నీ బూటకమే అంటూ ఫ్లెక్సీల ద్వారా ప్రజాసంఘాల నేతలు ఎండగట్టారు. ఎన్‌కౌంటర్లన్నీ ప్రభుత్వ హత్యలేనంటూ మానవహక్కుల సంఘాల నిలదీత పోస్టర్‌లు టేకులగూడెంలో దర్శనమిచ్చాయి. ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ అలియాస్ రణదేవ్ దాదా అంతిమ సంస్కారాలు గురువారం రాత్రి ముగిశాయి. ఉదయం ఏసోబు పార్థీవదేహాన్ని స్వగ్రామమైన టేకులగూడెంకు కుమారుడు మాచర్ల మహేశ్ తీసుకువచ్చారు. గ్రామస్తులు,బంధువులు, మావోయిస్టు అభిమానులు, సానుభూతిపరులు తండోపతండాలుగా టేకులగూడెం వచ్చి ఏసోబు పార్థీవదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యేలు ఆరూరి రమేశ్, దాస్యం వినయ్‌భాస్కర్, తెలంగాణ ఉద్యమకారుడు గాదె ఇన్నయ్య చేరుకుని ఏసోబు పార్థీవదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కళాబృందాలతో అంతిమయాత్ర

జోహార్ ఏసోబన్న.. ఏసోబన్న ఆశయాలను కొనసాగిద్దాం.. నీ త్యాగం మరువం.. అంటూ కళాబృందాలు, ప్రజాసంఘాల నేతల నినాదాలతో టేకులగూడెం హోరెత్తింది. ఏసోబు అంతిమయాత్ర గురువారం ఉదయం 11:30 నిమిషాలకు ప్రారంభమైంది. కళాకారులు ఆటలాడుతూ, పాటలు పాడుతూ భారీ ర్యాలీతో అంతిమయాత్ర సాగింది. ఎస్సీ కాలనీ నుంచి ప్రారంభమైన ఈ అంతిమయాత్ర.. గ్రామంలోని అన్ని కాలనీల మీదుగా సాగింది. సాయంత్రం 5:30 నిమిషాలకు విప్లవ సంప్రదాయం ప్రకారం నివాళులర్పించి దహన సంస్కారాలు నిర్వహించారు. ఏసోబు కుమారుడు మాచర్ల మహేశ్ దహన సంస్కారాలు పూర్తిచేశారు. కాగా, ఈ అంతిమ యాత్రలో ఇంటెలిజెన్స్ పోలీసులు పాల్గొని అంతిమ యాత్ర జరిగిన తీరు, హాజరైన వారి వివరాలు సేకరించినట్లు సమాచారం.



అంతిమయాత్రలో పాల్గొన్న కుటుంబీకులు

బూటకపు ఎన్‌కౌంటరే..

ఏసోబుది కచ్చితంగా బూటకపు ఎన్‌కౌంటరేనని మాజీ మావోయుస్టు భారతక్క ఆరోపించారు. అంతిమయాత్రకు హాజరైన ఆమె మాట్లాడుతూ.. మావోయిస్టులను పట్టుకుంటే పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించాలని, కానీ హత్య చేయడం దారుణమన్నారు. ఈ బూటకపు ఎన్‌కౌంటర్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బంధుమిత్రుల కమిటీ జాయింట్ సెక్రటరీ శాంతక్క, పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాదన కుమార స్వామి, తెలంగాణ ప్రజా ఫ్రంట్ జనగామ జిల్లా అధ్యక్షుడు పాకాల వెంకన్నలు మాట్లాడుతూ.. ఆదివాసీలను, గర్భిణులను బట్టలూడదీసి కాల్చడం పోలీసుల పాశవిక చర్యలు అన్నారు. బొగ్గు, ఇనుము బహుళ జాతీయులకు అంటగట్టడానికి ఖగార్ ఆపరేషన్ పేరుతో ఏసోబును బూటకపు ఎన్‌కౌంటర్ చేశారన్నారు. ఎన్‌కౌంటర్‌లన్నీ కేంద్ర ప్రభుత్వం చేసే హత్యలేనన్నారు. మూడోసారి అధికారం చేపట్టిన మోదీ, నితీష్, చంద్రబాబు నాయుడు అండతోనే ఈ ఎన్‌కౌంటర్లు చేస్తున్నారన్నారు. ఇలాంటివి జరగకుండా ఇండియా కూటమి నేతలు కేంద్రంపై ఒత్తిడి తేవాలన్నారు. ఏసోబు ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు జడ్జితో విచారణ చేయాలని డిమాండ్ చేశారు.



ఏసోబు అంతిమయాత్రలో బూటకపు ఎన్‌కౌంటర్ల ఫ్లెక్సీతో పౌరహక్కుల నేతలు

తుది దశకు ట్రాక్ మరమ్మతులు

▸▸ ఇంటికన్నె వద్ద రెండు పట్టాలు సిద్ధం

▸▸ తెల్లవారుజామున డౌన్‌లైనుపై ట్రయల్‌రన్

▸▸ పాక్షికంగా రైళ్ల పునరుద్ధరణ.. కాషన్ ఆర్డర్‌తో రాకపోకలు



ఇంటికన్నె వద్ద తెల్లవారుజామున డౌన్‌లైనులో ట్రయల్ రన్‌లో వెళుతున్న గూడ్స్



కేసముద్రం మండలం ఇంటికన్నె వద్ద మరమ్మతులు పూర్తి చేసుకొని సిద్ధమైన డౌన్ లైను

కేసముద్రం(మహబూబాబాద్ జిల్లా), సెప్టెంబరు 5: సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్‌లోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కేసముద్రం-ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్య 418 కిలోమీటరు వద్ద వరద ప్రవాహానికి ట్రాక్ ధ్వంసమైన ప్రాంతంలో మరమ్మతు పనులు తుది దశకు చేరుకున్నాయి. చెన్నై-న్యూ ఢిల్లీ గ్రాండ్ ట్రంక్ లైనుగా పేరున్న ఈ ట్రాక్‌లో నాలుగు రోజులుగా కొనసాగుతున్న ఈ మరమ్మతు పనులు దాదాపు పూర్తయ్యాయి. బుధవారమే అప్‌లైన్ సిద్ధమవగా గురువారం తెల్లవారుజామున మూడు గంటల సమయానికి డౌన్‌లైను మరమ్మతులు పూర్తిచేసి ట్రయల్ రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. దీంతో ఈ ప్రాంతంలో అప్ అండ్ డౌన్ లైన్లు రాకపోకలకు అందుబాటులోకి వచ్చాయి. ఉదయం నుంచి గోల్కొండ, కృష్ణా, ఈస్ట్‌కోస్ట్, అండమాన్, పద్మావతి ఎక్స్‌ప్రెస్‌లను అప్‌అండ్‌డౌన్ వైపుల నడిపించారు. అయితే మరమ్మతులు జరిగిన ప్రాంతంలో కాషన్ ఆర్డర్‌తో ఈ రైళ్లను నడపగా బుధవారం అప్‌లైనులో 5కిలోమీటర్ల వేగంతో వెళ్లగా, గురువారం 30 కిలోమీటర్ల వేగంతో వెళుతున్నాయి. ఇక తాజాగా అందుబాటులోకి వచ్చిన డౌన్‌లైనులో 5 కిలోమీటర్ల వేగంతోనే వెళుతున్నాయి. అయితే ఇక్కడ ట్రాక్ సిద్ధమైనప్పటికీ విజయవాడ రాయనపాడు ప్రాంతంలో రైల్వేట్రాక్ ముంపునకు గురి కావడంతో ఈ మార్గంలో పలు రైళ్లను నడపడంలేదని తెలుస్తోంది. శుక్రవారం నుంచి డోర్నకల్, భద్రాచలం రోడ్, మణుగూరు ప్రాంతాల నుంచి సికింద్రాబాద్, బల్లార్ష ప్రాంతాలకు నడిచే రైళ్లను పునరుద్ధరించనున్నట్టు తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఇంకా పూర్తిస్థాయిలో మరమ్మతుల కోసం రైల్వే సిబ్బంది ఈ ప్రాంతంలో పని చేస్తూనే ఉన్నారు. ఏదేమైనా వరద తాకిడికి పూర్తిగా తెగిపోయిన రైలుకట్టను నాలుగు రోజుల పాటు తీవ్రంగా శ్రమించి రెండు ట్రాక్‌లు అందుబాటులోకి తీసుకురావడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వరంగల్ మీదుగా పాక్షికంగా నడిచిన రైళ్లు

▸▸ నేటి నుంచి గోల్కొండ, శాతవాహన, ఇంటర్‌సిటీ

గిర్మాజీపేట, సెప్టెంబరు 5: భారీ వర్షాలు, వరదల కారణంగా ఇంటికన్నె-కేసముంద్రం, మహబూబాబాద్-తాళ్లపూసలపల్లి మధ్య ధ్వంసమైన రైల్వేట్రాక్‌ల పునరుద్ధరణ పనులు గురువారం ఉదయానికి పూర్తయి రైళ్ల రాకపోకలు కొనసాగుతున్నాయి. కానీ గురువారం విజయవాడ-సికింద్రాబాద్ మార్గంలో వరంగల్ మీదుగా రైళ్లు మాత్రం పాక్షికంగా నడిచాయి. సికింద్రాబాద్ - గుంటూరు, సికింద్రాబాద్-విజయవాడ మధ్య నడిచే గోల్కొండ, ఇంటర్‌సిటీ, శాతవాహన రైళ్లు రద్దవగా.. ఈ రైళ్లు శుక్రవారం నుంచి యథాతథంగా నడవనున్నాయి. ఇక విశాఖపట్టణం-మహబూబ్‌నగర్, విశాఖపట్టణం - నాందేడ్, తిరుపతి - సికింద్రాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్, గూడూరు - సికింద్రాబాద్ సింహపూరి ఎక్స్‌ప్రెస్, తిరుపతి-కరీంనగర్ ఎక్స్‌ప్రెస్, తాంబరం-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు గురువారం వరంగల్ మీదుగా వెళ్లాయి, అలాగే వరంగల్ మీదుగా వెళ్లాల్సిన కేరళ ఎక్స్‌ప్రెస్‌ను గురువారం కాజీపేట, సికింద్రాబాద్ మీదుగా దారి మళ్లించారు. అలాగే న్యూఢిల్లీ- చెన్నై, న్యూఢిల్లీ-విశాఖపట్టణం మధ్య నడిచే జీటీ, తమిళనాడు, ఏపీ ఏసీ రైళ్లను గురువారం రద్దు చేశారు. దూరప్రాంతాల నుంచి బుధవారం బయలుదేరిన కొన్ని రైళ్లు మాత్రమే గురువారం వరంగల్ మీదుగా వెళ్లాయి. శుక్రవారం నుంచి అన్ని రైళ్లు యథావిధిగా నడుస్తాయని గురువారం రాత్రి రైల్వే వర్గాలు వెల్లడించాయి.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2945	2700
పల్లికాయ (సూక)	5100	4500
పల్లికాయ (పచ్చిది)	4500	3400
పెసళ్లు	6833	4552
పత్తి	7665	5000
పసుపు (కాడి)	12759	10000
పసుపు (గోల)	12009	10009
తేజ మిర్చి	12000	9000
తేజ ఏసీ	18000	14000
వండర్‌హాట్ ఏసీ	15200	13000
యూఎస్341 ఏసీ	14500	11000
దేశీ ఏసీ	22000	20000
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


బాలయేసు హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న యాజమాన్యం


సెయింట్ పాల్స్ స్కూల్‌లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు


హ్యాపీ టీచర్స్ డే అక్షరాకృతిలో నర్మెట కస్తూర్బా పాఠశాల విద్యార్థినిలు

లింగాలఘణపురం :ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు లింగాలఘణపురం మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాధాక్రిష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి, టీజీఎంఎస్ ప్రిన్సిపాల్ పుష్పకుమారి, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ, కాంప్లెక్స్ హెచ్‌ఎం మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని గుమ్మడవెల్లిలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు దారం అశోక్, ప్రధానకార్యదర్శి అనంతరాములు పాల్గొన్నారు.

బాలయేసు ఉపాధ్యాయులకు ఘన సన్మానం

దేవరుప్పుల : ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా దేవరుప్పులలోని బాలయేసు హైస్కూల్‌లో గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫాదర్ దిలీప్‌కుమార్ హాజరయ్యారు. పాఠశాల ఉపాధ్యాయులందరికి యాజమాన్యం గిఫ్ట్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖాజా, మదన్‌మోహన్, మహేష్, కృష్ణ, అనిత, మాధవి, విజయలక్ష్మీ, సరిత, అశ్వినీ, షబానా తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పాల్స్ ఉన్నత పాఠశాలలో ..

జనగామ కల్చరల్: జిల్లా కేంద్రంలోని సెయింట్‌పాల్స్ ఉన్నత పాఠశాలలో గురు పూజోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులచే స్వయంపాలనా దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి ప్రిన్సిపాల్ మరియ జోసెఫ్ బహుమతులు అందజేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● రఘునాథపల్లి : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురుపూజోత్సవ వేడుకలు మండలంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలతో పాటు మండలంలోని కోమల్ల ప్రాథమిక పాఠశాల, ఖిలాషాపూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను విద్యార్థులు పూలమాలలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. అలాగే లయన్స్ క్లబ్ ఆఫ్ రఘునాథపల్లి స్టేషన్ సభ్యులు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రదానోపాధ్యాయులు సిహెచ్, ఉపేందర్, జాన్ సుందర్ రావు, భారత రవిందర్, ఉపాధ్యాయులు బాల్నే నాగభూషణం, సంతోష్ రెడ్డి, మాధవి, అన్నపూర్ణ, పుష్ప పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ : మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురువారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లోని విద్యాసంస్థల్లో విద్యార్థులు చదువు చెబుతున్న గురువులకు ఘనంగా సన్మానించారు. స్టేషన్‌ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లోని హైస్కూళ్లు, పీఎస్‌లు, యూపీఎస్‌లలో, ప్రభుత్వ పాలిటెక్నిక్, సంక్షేమ గురుకులం, మోడల్ స్కూల్, కస్తూర్బా విద్యాలయం, ప్రభుత్వ పాలిటెక్నిక్, జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఉత్సాహంగా నిర్వహించారు. శివునిపల్లి హైస్కూల్‌లో టీచర్స్ డే సందర్భంగా 25 మంది టీచర్లను ఘన్‌పూర్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ కిషన్ రాజు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

● జఫర్‌గఢ్ : మండలంలోని ఆయా విద్యాలయాల్లో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. మండలంలోని కూనూరు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులతో ఇదే పాఠశాల నుంచి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడికి ఎంపికైన వెనిగండ్ల శ్రీనివాస్‌ను స్థానిక ఎన్‌ఆర్‌ఐ, దాతలు ముచ్చ శ్యాంసుందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, శాలువాలతో సన్మానించారు. అలాగే మండలంలోని హిమ్మత్‌నగర్ హైస్కూల్ హెచ్‌ఎం జయప్రకాశ్, ఉపాధ్యాయ బృందాన్ని శివునిపల్లి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సత్కరించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్, తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ దేవులపల్లి శ్రీకాంత్‌తో పాటు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత రేచరేణి కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులను సన్మానించారు.

● బచ్చన్నపేట : కన్న తల్లిదండ్రుల తరువాత గురువు దైవంతో సమానమని మండలంలోని పాఠశాలల్లో జరిగిన గురుపూజ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అతిథులు తెలిపారు. గురువారం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత ఉన్నత పాఠశాలలో గురుపూజా దినోత్సవాన్ని పురష్కరించుకుని ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో హాజరైన అతిథులు, విద్యార్థులు సన్మానించారు.

● చిలుపూర్ : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని మండలంలోని మల్కాపూర్, ఫతేపూర్, పల్లగుట్ట, చిన్నపెండ్యాల, చిలుపూర్ తదితర గ్రామాల్లో ఘనంగా వేడుకలను నిర్వహించారు. రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. మండల ంలోని మల్కాపూర్ ప్రభుత్వ పాఠశాలలో 1971 -72బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఏడవెళ్లి మాధవరెడ్డి, బబ్బుల శంకరయ్య వేడుకలు జరిగాయి. కార్యక్రమాల్లో హెచ్‌ఎం రవిబాబు, జుబేదాబేగం, వాణిరాణి, ఫాతిమారాణి, సరోజన, అంజనీ, స్వర్ణలత పాల్గొన్నారు.

● జనగామ కల్చరల్ : జనగామ జిల్లా కేంద్రం లోని ఏబీవీ ప్రభుత్వ ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో స్వయం పాలనా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశానికి హెచ్‌ఎం శోభ కిరణ్ అధ్యక్షత వహించగా స్కూల్ సెక్రటరీ,కరస్పాండెంట్ మహంకాళి హరిశ్చంద్ర గుప్తా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు శృతి డీఈవోగా, దిలీప్ హెచ్‌ఎంగా, నాగరాణి, భావన, యమున, సామియా, సోఫియా, దుర్గప్రసాద్, రామ్‌చరణ్, వినయ్ కుమార్, జశ్వంత్, ఆఫ్రీన్, శివకుమార్, గౌరవ్ టీచర్స్‌గా వ్యవహరించారు.

● నర్మెట : మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని మచ్చుపహాడ్, నర్మెట, హన్మంతాపూర్, మల్కపేట, గండిరామవరం, కన్నెబోయినగూడెం, అమ్మాపురం, మోడల్ సూల్‌లో, కస్తూర్బా పాఠశాల తదితర గ్రామాలలోని పాఠశాలలో విద్యార్థులు తమ ఉపాధ్యాయులను సన్మానించి ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు.

● తరిగొప్పుల : డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి వేడుకలను (ఉపాధ్యాయ దినోత్సవాన్ని) పురస్కరించుకుని మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం విద్యార్థులు గురువులను ఘనంగా సత్కరించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బానోతు రవీందర్, ఉపాధ్యాయులు ఎల్లయ్య, బయ్యన్న, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


చిలుపూరు : మల్కాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో


శివునిపల్లి హైస్కూల్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ బాధ్యులు


జఫర్‌గఢ్ కూనురు పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

ఇంటర్ విద్యాధికారికి ఘన సన్మానం

దేవరుప్పుల, సెప్టెంబరు 5: జిల్లా ఇంటర్ విద్యాధికారిని దేవరుప్పుల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం విద్యార్థులు జిల్లా ఇంటర్ విద్యా అధికారి (డీఐఈవో)కల్లూరి జితేందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అధ్యాపకులు బోధించిన విషయాలను శ్రద్ధగా గ్రహించి ఉన్నత శిఖరాలకు చేరాలని తెలిపారు. డాక్టర్ సర్వేపెల్లి రాధాకృష్ణన్ సూచించిన మార్గాన్ని ప్రతీ ఒక్కరూ ఆచరించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కొలిపాక భాస్కర్, జాతీయ సేవాపథకం ప్రోగ్రాం అఫీసర్ జినుగ అరుణాకర్, అధ్యాపకులు రాధిక, చైతన్య, రహీమున్నీసా, హరిత, రవీందర్, సుమ, మహేష్, ఉదయ్, అనురాధ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎంతోనే అమరవీరుల ఆశయాలు సాధ్యం


తమ్మడపల్లిలో స్థూపాల వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఎం నేతలు

బచ్చన్నపేట సెప్టెంబరు 5: తెలంగాణ ప్రాంతంలో దొరలు, భూస్వాముల వద్ద నుంచి భూములు గుంజుకుని పేదలకు పంచిన ఉద్యమంలో అనేక మంది అమరులయ్యారని, వారి ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు సీపీఎం పార్టీ నిరంతరం పనిచేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ అన్నారు. గురువారం మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో సీపీఎం పార్టీ మండల మహాసభ జరిగింది. కార్యక్రమానికి హాజరైన అబ్బాస్ మాట్లాడుతూ అమరుల యాదిలో తెలంగాణ పక్షోత్సవాలను ఈ నెల 6 నుంచి 17 వరకు నిర్వహించడం జరుగుతుందని, జిల్లా వ్యాప్తంగా అమరులను స్మరించుకుంటూ కార్యక్రమాలు జరుపనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలోని అమరుల స్థూపాల వద్ద నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడారు. నాయకులు సుంచు విజేందర్, బెల్లంకొండ వెంకటేశ్, బండకింది బాల్‌నారాయణ, రవీందర్‌రెడ్డి, ఎల్లయ్య, అశోక్, బలరాములు, వెంకటమ్మ, రవీందర్, సిద్దయ్య, రాజయ్య, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలి

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 5: భారీ వర్షాలతో అనేక రకాలుగా ఇబ్బందులు పడిన రైతులను, ప్రజలను పట్టించుకోకుండా ప్రభుత్వం మొద్దునిద్రలో ఉందని, వెంటనే ప్రజల సమస్యల పై దృష్టి పెట్టాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు బొజ్జపల్లి సుభాష్ ఆరోపించారు. గురువారం మండలంలోని తానేధార్‌పల్లి గ్రామంలో భారీ వర్షాలతో ఇల్లు కూలిపోయిన బాస్కుల అశోక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇప్పటికైన ప్రభుత్వం వెంటనే స్పందించి ఇళ్లు కూలిపోయిన, పంట నష్టం వాటిల్లిన వారికి తగు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి, మండలాధ్యక్షుడు సట్ల వెంకటరమణ, బాస్కుల ఆరోగ్యం, రడపాక ప్రదీప్, రాజ్‌కుమార్, ఆకుల నవీన్, ఎల్లారెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

అనారోగ్యంతో జూనియర్ అసిస్టెంట్ మృతి

జఫర్‌గఢ్, సెప్టెంబరు 5 : జఫర్‌గఢ్ మండల పరిషత్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ రాజోజు రఘుకుమార్ (40) గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. కొద్ది రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురి కాగా కుటుంబ సభ్యులు అతడిని హనుమకొండలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం చనిపోయినట్లు ఉద్యోగ సిబ్బంది తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ రఘుకుమార్ అకాల మరణం పట్ల ఎంపీడీవో సుమన్, వివిధ శాఖల అధికారులు, కార్యాలయ ఉద్యోగ సిబ్బంది తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. హనుమకొండలో అతడి మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరిన ఏడాదిలోనే అకాల మరణం చెందడం తోటి ఉద్యోగులను కలిచివేసింది.

బాధిత కుటుంబాలకు పరామర్శ

దేవరుప్పుల, సెప్టెంబరు 5: ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల కడవెండి వాగు ఉధృతంగా ప్రవహించగా అందులో గొర్రెలు, మేకలు కొట్టుకుపోయిన బాధిత కుటుంబాలను గురువారం గొర్రెల మేకల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు పరామర్శించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన ఉప్పుల చెంద్రయ్య, ఎండీ. అంకూస్‌కు చెందిన గొర్రెలు, మేకలు భారీ సంఖ్యలో వాగులో వరద తాకిడికి కొట్టుకుపోగా వారిని పరామర్శించి, జరిగిన విషయాన్న అడిగి తెలుసుకుని ఓదార్చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడి బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చూడాలని వెంటనే వారికి నష్ట పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి చింత రవి, నాయకులు నక్క రమేష్, తాటిపెల్లి మహేష్, సులుగూరి మహేష్, రాములు పాల్గొన్నారు.

గుల్బర్గా ఎంపీని కలిసిన ఇందిర


ఎంపీని సన్మానిస్తున్న ఇందిర

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు 5: కర్ణాటక రాష్ట్రంలోని గుల్బర్గా పట్టణ ఎంపీ రాధాకృష్ణను టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగపురం ఇందిర గురువారం గుల్బర్గ పట్టణంలోని ఎంపీ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన, అమలు చేస్తున్న పథకాలపైన రాధాకృష్ణ ఇందిరతో చర్చించినట్లు తెలిపారు.

కేసీఆర్ పథకాలు దేశానికే మార్గదర్శకం

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి


జనగామలో కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

నర్మెట, సెప్టెంబరు 5 : గత ప్రభుత్వంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశానికే మార్గదర్శకంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో గురువారం 56 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ హాయంలో కేసీఆర్ కల్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తుచేశారు ప్రస్తుత ప్రభుత్వం కల్యాణ లక్ష్మీడబ్బులతో పాటు తులం బంగారం ఇస్తానని హామీ ఇచ్చిందని, చెక్కులు ఇస్తున్నారు కానీ తులం బంగారం ఏమైందని మహిళలు అడుగుతున్నారన్నారు. ప్రభుత్వం కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం కూడా ఇవ్వాలన్నారు. దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ పనుల కోసం రూ. 200 కోట్లు కేటాయిస్తే జనగామ నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందన్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు 4 మోటర్ల ఆన్ చేసి చెరువులను నింపాలన్నారు. జనగామ కార్యక్రమంలో తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీవో అరవింద్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు గద్దల నర్సింగరావు, బీఆర్‌ఎస్ ఉమ్మడి మండల కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి, మండల అధ్యక్షుడు చింతకింది సురేష్, మాజీ ఎంపీపీ తేజావత్ గోవర్దన్, మాజీ జడ్పీటీసీ మాలోతు శ్రీనివాస్, మాజీ జడ్పీ కో ఆప్షన్ ఎమ్డీ గౌస్, నాయకులు పాల్గొన్నారు.

● జనగామ రూరల్ : బీఆర్‌ఎస్ హయంలోనే తెలంగాణ అభివృద్ధి చెందిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని గాయత్రి ఫంక్షన్‌హాల్లో గురువారం ఎమ్మెల్యే జనగామ మండలం, పట్టణానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమున, మార్కెట్ మాజీ చైర్మన్ బాల్దె సిద్దిలింగం, మున్సిపల్ వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, కౌన్సిలర్లు తాళ్ల సురేష్‌రెడ్డి, వాంకుడోత్ అనిత, పెర్ని స్వరూప, సర్పంచుల ఫోర్లం మండల అధ్యక్షురాలు బొల్లం శారద తదితరులు పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం

దేవరుప్పుల, సెప్టెంబరు 5: మండలకేంద్రానికి చెందిన పాన్‌షాప్ యజమాని బాబు నవీన్ వద్ద రూ. 19వేలు విలువ గల గుట్కా ప్యాకెట్లను దేవరుప్పుల పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. బాబు నవీన్‌పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు దేవరుప్పుల ఎస్సై సృజన్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పాన్‌షాపులు, కిరాణ తదితర షాపుల్లో గుట్కాలు అమ్మవద్దని, విక్రయిస్తూ పట్టుపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మండపాలకు అనుమతులు తప్పనిసరి

బచ్చన్నపేట, సెప్టెంబరు 5: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో ఏర్పాటు చేసుకునే గణేశ్ మండపాలకు అనుమతులు తప్పని సరిగా తీసుకోవాలని ఎస్‌ఐ సతీష్ కోరారు. పీఎస్‌కు రాకుండానే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించబడిందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్వాహకులు వ్యవహరించకూడదని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ మాసోత్సవం

పాలకుర్తి, సెప్టెంబరు 5 : మండలంలోని అన్ని గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకుర్తి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసోత్సవ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తాహేరా బేగం హాజరై మాట్లాడారు. గీతారాణి, ఇప్పలకుంట కేంద్రం దూలమ్మ, కోమల ఉన్నారు.

శివునిపల్లిలో వైద్య శిబిరం

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 5: గ్రామీణ ప్రాంత ప్రజలు, విద్యార్థులు ఆ రోగ్య సూత్రాలు పాటించాలని స్టేషన్ ఘన్‌పూర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జనార్దన్ అన్నారు. గురువారం స్థానిక శివునిపల్లి పట్టణ బొడ్రాయి వద్ద, ఎస్టీ బాలుర హాస్టల్‌లో వైద్య శిబిరాలు నిర్వహించారు. వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డెన్ వెంకట్, సూపర్‌వైజర్ సునంద, ఏఎన్‌ఎంలు స్వప్న, సుమలత, ప్రసాద్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘన్‌పూర్ ఆస్పత్రిలో డెంగీ చికిత్స

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 5: డివిజన్ కేంద్రం స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసూతి సేవలతో పాటు డెంగ్యూ, టైఫాయిడ్ వంటి విష జ్వరాలకు సైతం నిత్యం వైద్య సేవలు అందిస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంధ్యారాణి అన్నారు. గురువారం ఆస్పత్రిలో నిర్వహించిన సమావేశంలో సూపరింటెండెంట్ మాట్లాడారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధీర్, డాక్టర్ సుమన్, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ సౌఖ్య, డాక్టర్ సంధ్య, డాక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మహిళ మృతి

చిలుపూర్, సెప్టెంబరు 5 : మండలంలోని ఫతేపూర్‌లో అనారోగ్యం కారణంగా మృతిచెందిన గుగులోతు జుమాని (50) కుటుంబాన్ని ఫతేపూర్ యువసేన ప్రతినిధి బాషానాయక్, మాజీ సర్పంచ్ రూప్లానాయక్ గురువారం సందర్శించారు. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళి అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబం కడు పేదరికంలో ఉండడాన్ని గమనించి కొంతమంది గ్రామస్థులతో పాటు, యువకులు ముందుకొచ్చారు. తలా కొంత నగదును సేకరించారు. జయ అయిన రూ 20 వేల మొత్తాన్ని దహన సంస్కారాల నిమిత్తం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాలూనాయక్, చింతల భాస్కర్, భూక్య తిరుపతి, రాజుగౌడ్, కనకచారి, వెంకటేశ్, శ్రీధర్, మోతీలాల్, పల్లె రాజేశ్, శంకర్, సంజీవ పాల్గొన్నారు.

సమస్యలపై సంఘటితం కావాలి

జఫర్‌గఢ్, సెప్టెంబరు 5 : సమస్యల పరిష్కారం కోసం ముదిరాజ్‌లంతా సంఘటితం కావాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ ప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం జఫర్‌గఢ్‌లో ముదిరాజ్‌లతో సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ హక్కుల సాధన కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. ఈ నెల 8న ఆదివారం ఉదయం 11 గంటలకు హనుమకొండ పెద్దమ్మగడ్డ రోడ్‌లోని శారద ఫంక్షన్ హాల్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ముదిరాజ్ ముఖ్య నేతల సమావేశం నిర్వహిస్తున్నట్లు జగదీశ్వర్ ప్రసాద్ తెలిపారు. సమావేశానికి సంఘం ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వల్మిడి టూ బమ్మెరకు ఆటో సౌకర్యం

పాలకుర్తి, సెప్టెంబరు 5 : మండలంలోని వల్మిడి వయా పాలకుర్తి మీదుగా బమ్మెర గ్రామాలకు భక్తుల సౌకర్యార్థం ఆటో సౌకర్యం కల్పిస్తామని డీఆర్‌డీవో పీడీ వసంత అన్నారు. గురువారం మండలంలోని వల్మిడి గ్రామంలో మహిళా పొదుపు సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేయగా ముఖ్యఅతిథిగా వసంత హాజరై మాట్లాడారు. వల్మిడి గ్రామానికి చెందిన మహిళా పొదుపు సంఘాల్లో ఇద్దరి మహిళలకు ఎలక్ట్రిక్ ఆటోలను రుణాలు మంజూరు చేసి అందచేస్తామన్నారు. కార్యమంలో అదనపు డీఆర్‌డీవో శ్రీనివాస్, ఏపీఎం నరేందర్, అనురాధ, సీపీలు అనిత, అరుణ, స్వరూప, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు ప్రమీల ఉన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ


విరాళాలు సేకరిస్తున్న నాయకులు

రఘునాథపల్లి, సెప్టెంబరు 5: వరద బాధితుల సహాయార్థం కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వివిధ వ్యాపార వాణిజ్య కేంద్రాలు, కూరగాయల షాపులు, చిరు వ్యాపారులు తదితరుల నుంచి గురువారం విరాళాలను సేకరించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్ మాట్లాడుతూ వరద బాధితుల కోసం సేకరించిన విరాళాల రూపేణ వసూలైన డబ్బులను కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పేర్నె ఉషరవి, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు కడారి రవి, తోటకూరి రమేష్, రాజ్‌కుమార్, గొల్లూరి పృథ్వీ, రంగు రాజు, కొంరెల్లి పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదును జయప్రదంచేయాలి

లింగాలఘణపురం, సెప్టెంబరు5: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఊడ్గుల రమేశ్ పిలుపునిచ్చారు. గురువారం లింగాలఘణపురం మండల కేంద్రంలో జరిగిన బీజేపీ మండలస్థాయి కార్యకర్తల సమావేశానికి మండల అధ్యక్షుడు ప్రజ్ఞాపురం అంజనేయులు అధ్యక్షత వహించగా రమేశ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు బీజేవైఎం స్టేట్ ప్రోటోకాల్ కన్వీనర్ దూసరి విజయ్‌కుమార్, పసుల అశోక్, ప్రధాన కార్యదర్శి సంపత్, కేమిడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత


ఎల్‌వోసీని అందజేస్తున్న కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి

నర్మెట, సెప్టెంబరు 5 : మండలకేంద్రానికి చెందిన మడిపెద్ది శ్రీనివాస్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్యానికి అయ్యే ఖర్చు భరించలేక శ్రీను కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని డీసీసీ ఉపాధ్యక్షుడు గంగం నర్సింహరెడ్డికి తెలిపారు. వెంటనే బాధితుని విషయాన్ని డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి తెలుపగా వెంటనే స్పందించి దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి రూ. 2.50 లక్షల ఎల్‌వోసీని మంజూరు చేయించి గురువారం బాధితుని కుటుంబ సభ్యులకు ఎల్‌వోసీ పత్రాన్ని కొమ్మూరి అందించారు. ఈసందర్భంగా బాధితుని కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఎల్‌వోసీని మంజూరు చేయించిన గంగం నర్సింహరెడ్డికి, కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.